క్లుప్తంగా

తిరుపతికి ఈవీఎంల తరలింపు



సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల నుంచి తిరుపతికి తరలిస్తున్న ఈవీఎంలు

సత్యవేడు: నియోజకవర్గ పరిధిలో ఏడు మండలాల్లో 279 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాట్లను తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి తరలిస్తున్నట్లు సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల అధికారి నరసింహులు తెలిపారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాల స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని పలు పార్టీల ఏజెంట్లు సమక్షంలో టెంపోల్లో భద్రపరిచి తిరుపతికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ నరసింహులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కె.శ్యాంప్రసాద్ రెడ్డి, మండల యువత అధ్యక్షుడు వంశీకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

18 నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఈవో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18న అంకురార్పణ, 19న ధ్వజారోహణం, 23న గరుడ సేవ, 24న కల్యాణోత్సవం, గజవాహన సేవ, 25న వసంతోత్సవం, రాత్రి రథోత్సవం, 26న రాత్రి పల్లకీసేవ, 27న పార్వేట ఉత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, 28న శాంతి అభిషేకం, రాత్రి ఏకాంత సేవలో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

డీవీసత్రం వైపు అందరిచూపు



పోలిరెడ్డిపాళెంలో బారులుతీరిన మహిళలు

దొరవారిసత్రం: సూళ్లూరుపేట నియోజకవర్గంలోనే 2014 సంవత్సరం సార్వత్రిక ఎన్నికల్లో రెండవ స్థానం (3,614ఓట్లు), 2019లో మొదటి స్థానం (9,526ఓట్లు)లో అత్యధిక ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఓట్లు పోలైన విషయం తెలిసింది. అదే తరహాలో ఇప్పుడు నిర్వహించిన ఎన్నికల్లో కూడా అధిక ఓట్లు పోల్ అవుతాయని ఇటు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతలు సమీక్షించుకుంటూ లెక్కలు వేసుకుంటున్నారు. జగనన్న సంక్షేమం వైపు మొగ్గు చూపిన మహిళలు పలు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేసేందుకు బారులు తీరారు. 2014 ముందు వరకు డీవీ సత్రం మండలం టీడీపీకి కంచుకోటగా పేరుంది.

జగన్ సీఎం కావడం ఖాయం

- కిలివేటి సంజీవయ్య



కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ఎండను సైతం లెక్కచేయక అధికసంఖ్యలో ప్రజలు క్యూలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, మళ్లీ కాబోయే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని సూళ్లూరుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య అన్నారు. పట్టణంలోని సంజీవయ్య క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. నియోజవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన పార్టీ శ్రేణులందరూ కలిసికట్టుగా ఎన్నికల రోజున పనిచేశారన్నారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు నిర్ణయించుకున్నారని పోలింగ్ సరళిబట్టి తెలిసిపోతోందన్నారు. మేము సైతం జగనన్నకు తోడుగా అన్నట్లుగా ప్రజలు తరలివచ్చి ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం తథ్యమన్నారు.

ప్రతిఒక్కరికీ రుణపడి వుంటా..

వైఎస్సార్‌సీపీ విజయం కోసం పార్టీ జెండాను మోసిన ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటానని సంజీవయ్య అన్నారు. జగనన్నను మళ్లీ సీఎం చేసుకునేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, సైనికుల్లా పనిచేశారన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నేతలు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు టీడీపీ తల వంచక తప్పదన్నారు. నియోజవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన నేతలు మంగళవారం సంజీవయ్యను కలిసి ఆయన సహా, ఎంపీ అభ్యర్థి గురుమూర్తి విజయం తథ్యమని చెప్పారు.

కండలేరులో 6.813 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.813 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రకృతి రమణీయం.. ఉబ్బలమడుగు



ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొలనులో ఈత కొడుతున్న పర్యాటకులు



వ్యూ పాయింట్

వరదయ్యపాళెం: స్వచ్ఛమైన నీరు, గాలి, పచ్చటి అడవి ... పక్షుల కిలకిలా రావాలు, కొండ కోనల్లోంచి నిరంతరం ప్రవహించే సెలయేరు... సహజ సిద్ధంగా ఏర్పడ్డ జలపాతం, చుట్టూ ఎత్తైన కొండలు... ఇలా పర్యాటకులను ఆకర్షించే ఎంతో ఆహ్లాదకరమైన ప్రాంతం ఉబ్బలమడుగు. ప్రకృతి ప్రేమికులకు, పర్యాటకులకు వేసవిని చల్లగా మార్చే విడిది కేంద్రం ఉబ్బలమడుగు. పర్యాటకులను ఆకర్షించేందుకు ఆటవీశాఖ చేపట్టిన ఎకోటూరిజం అభివృద్ధి పనులతో ఉబ్బలమడుగు కొత్త అందాలను దిద్దుకుంటోంది. వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల సరిహద్దుల్లో కాంబాకం రిజర్వు ఫారెస్టులో సహజ సిద్ధంగా ఏర్పడిన ఉబ్బలమడుగు పర్యాటకులకు స్వర్గధామం. వరదయ్యపాళెం నుంచి 10కిలో మీటర్ల దూరంలో ఉబ్బలమడుగు ఉంది. ఒక రోజు విహారయాత్రకు ఇది చక్కటి ప్రదేశం.

చూడాల్సిన ప్రాంతాలు

వరదయ్యపాళెం నుంచి 7కి.మీ ప్రయాణిస్తే అవంతి ఫ్యాక్టరీ వస్తుంది. ఈ ఫ్యాక్టరీని దాటితే రిజర్వు ఫారెస్టు మొదలవుతుంది. ఫారెస్టు మొదట్లో తెలుగుగంగ కాలువ, టోల్ గేట్ ఉంది. ఈ ప్రాంతం నుంచి సూమారు 12 కి.మీలలో సెలయేరు నిరంతరం ప్రవహిస్తుంది. సెలయేరు పక్కన వరుసగా తంతి పందిరి, దొరమడుగు, సీతలమడుగు, తంగశాల, పెద్దక్కమడుగు, ఉబ్బలమడుగు, సిద్ధేశ్వరగుడి, సదికూటిమడుగు, అంజూరుగంగ, దోగుడు బండ జలపాతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని సీతాళం అని పిలుస్తారు. సిద్ధేశ్వరగుడి నుంచి 3కిలో మీటర్లు కొండపై ప్రయాణించడం కష్టసాధ్యం కావడంతో పర్యాటకులు ఉబ్బలమడుగుకే పరిమితమవుతారు. ఈ ప్రాంతాలను సందర్శించడానికి అటవీశాఖ నామమాత్రపు రుసుంతో సహాయకులను నియమించింది.

తంతిపందిరి(తన్నీర్ పందిల్)

ఒకప్పుట్లో బ్రిటీష్ పాలకులు చేపల పెంపకం కోసం ఎంపిక చేసిన ప్రాంతమై ఈ తన్నీర్ పందిల్ ఇప్పుడు తంతిపందిరిగా వూరింది. వరదయ్యపాళెం నుంచి ఇక్కడ వరకు వెళ్లేందుకు తారు రోడ్డు ఉంది. ఉబ్బలమడుగు వరకు వెళ్లలేనివారు ఇక్కడి మడుగులోనే సేద తీరుతుంటారు.

ఉబ్బలమడుగు(ఉపరి మడుగు):

తంతి పందిరి నుంచి 3కిలో మీటర్లు దూరంలో ఉబ్బలమడుగు ఉంది. వాహనాల్లో వెళ్లేదుకు గ్రావెల్ మార్గం ఉంది. 1953 ప్రాంతంలో చిత్తూరుకు చెందిన శ్రీనివాసన్ దొర బ్రిటీష్ మిలటరీలో కీలక స్థానంలో విధులు నిర్వహించి తన రిటైర్మెంట్ సమయంలో విశ్రాంత జీవనం కోసం ఈ ప్రాంతాన్ని ఆంగ్ల పాలకుల నుంచి ఈనాంగా పొందారు. ఇక్కడే దొరమడుగు, మామిడి చెట్లు మడుగు, తంగశాల మడుగు, మూలమడుగు, చద్దికూటి మడుగులున్నాయి. శివరాత్రి పర్వదినం సందర్భాల్లో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతుంది. మిగిలిన సమయాల్లో ఆటోలు నడుస్తుంటాయి.

సిద్ధులకోన


పూర్వం మునులు ఈ ప్రాంతంలో ఉన్నందున సిద్ధులకోన అనే పేరు వచ్చింది. ఇక్కడకు వెళ్లాలంటే ట్రాక్టరు వంటి వాహనాల్లో, కాలినడకన 2కి.మీ వెళ్లాల్సి ఉంటుంది. భక్తులు పక్కనే ఉన్న సిద్ధుల మడుగులో స్నానాలు ఆచరించి సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుంటారు.

ఎగువ శీతాలం

సుమారు 300అడుగుల నుంచి పడుతున్న జలపాతం. పక్కనే లోతైన నీటి మడుగు. గొడుగులా ఇరువైపులా వ్యాపించి ఉండే కొండ వంపు. ఇది చాలా అందమైన ప్రాంతం. తెలుగు చిత్రసీమకు మద్రాసు కేంద్రంగా ఉన్నప్పుడు ఎక్కువగా ఉబ్బలమడుగులో షూటింగులు జరిగేవి.



ఎగువ శీతాలంలో కొండ శిఖరం నుండి జాలువారుతున్న జలపాతం



దిగువ శీతాలంలో జాలువారుతున్న జలపాతం

ఆహ్లాదం... విజ్ఞానం

పర్యాటకులకు ఆహ్లాదంతో పాటు విజ్ఞానం అందించే దిశగా అటవీశాఖ ఎకో టూరిజంగా ఉబ్బలమడుగు ప్రాంతాన్ని రూపుదిద్దుతోంది. చెట్లు, వాటి శాస్త్రీయ నామాలు, పుట్టుక లాంటి విశేషాలను దారి పొడవునా పేర్లతో సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. రాజులు వాడిన ఫిరంగి, టన్ను బరువు ఉండే తిరగలి, పూసలదిబ్బ, ఎలిజిబెత్ రాణి బంగ్లా, పాలెగాళ్లు, వారి తోటలు ఇలా అన్నింటినీ పర్యాటకులు తెలుసుకోవల్సినవే.



తంతి పందిల్ వద్ద అటవీ అధికారులు ఏర్పాటు చేసుకున్న చెక్‌పోస్ట్

దిగువశీతాలం

లోతైన మడుగులు, నిలువెత్తు జలపాతాలకు నెలవు ఈ దిగువ శీతాలం. రెండు కొండ చరియల నడుమ ఉండే ఈ ప్రాంతాల్లో ఎటు చూసినా తేనెతుట్టెలు కనిపిస్తుంటాయి. సిద్ధులకోన నుంచి కొండబండల నడుమ 2కి.మీ దూరం కాలినడకన దిగువశీతాలం వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడున్న నీటి మడుగులు రెండు తాటిచెట్లకు పైగా లోతున్నా నీరు స్వచ్ఛంగా ఉండడంతో లోపలి ఉన్న రాళ్లు సైతం పైకి కనిపిస్తూ పర్యాటకులను తికమకకు గరి చేస్తాయి. నీటి మడుగులోకి దిగితే ఎంత వేసవిలోనైనా చలితో వణుకు తెప్పిస్తాయి.

పర్యాటకులకు మరిన్ని వసతులు



ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రానికి వచ్చే సందర్శకులకు మరిన్ని వసతులు కల్పించేందుకు కార్యాచరణ చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని వసతులు కల్పించాం. జలపాతాల వద్ద బోటింగ్ పార్కులు, మరో వ్యూ పాయింట్, విశ్రాంత గదులు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అందుకు సంబంధించి ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తాం.

– జి.జయప్రసాదరావు, ఎఫ్ఆర్ఓ, సత్యవేడు


గంగమ్మకు వేడుకగా పుట్టింటి సారె



గంగమ్మ తల్లి పుట్టిల్లు అవిలాల నుంచి సారెను తీసుకొస్తున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ అర్చకులు, సిబ్బంది, కైకాల కులస్తులు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి అవిలాల నుంచి మంగళవారం రాత్రి సాంప్రదాయ పుట్టింటి సారె వేడుకగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రీతాతయ్యగుంట గంగమ్మకు తొమ్మిది రోజులపాటు అత్యంత వైభవంగా జాతర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. తిరుపతి గంగ జాతర ముందు వారం అమ్మవారి పుట్టినిల్లు అయిన అవిలాలలో జాతర చాటింపు చేసి గ్రామస్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో జాతర వేడుకలను జరుపుకుంటారు. చివరి రోజు అవిలాలలోని అమ్మవారి పుట్టింటి సారె నడిపే పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి ఇంటి నుంచి ఆడపడుచుకు సాంప్రదాయ బద్ధంగా అందించే పుట్టింటి సారెను అవిలాల పొలిమేరలో వెలసిన గంగమ్మ గుడి వద్దకు మేళతాళాల మధ్య కోలాహలంగా తీసుకొచ్చారు. అమ్మవారి సారెను అందుకునేందుకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈఓ కె.మమత, సిబ్బంది, జాతరలో వంశపారంపర్యంగా కీలక పాత్ర పోషిస్తున్న కైకాల వంశీయులు అవిలాల పొలిమేరలోని గంగమ్మ గుడికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టింటి వారి నుంచి అమ్మవారికి సారెను అందుకొని ఊరేగింపుగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. సారెను గంగమ్మ గుడి అధికారులు, కైకాల వంశస్తులు స్వీకరించి ఊరేగింపుగా తిరుపతి తాతయ్యగుంట ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి సారెతో అలంకరించి పూజలు నిర్వహించారు. తర్వాత సాంప్రదాయ బద్ధంగా కైకాల కులస్తులు బేరివీధికి చేరుకుని చాటింపు పూజ చేపట్టారు. అనంతరం నాటి నగర సరిహద్దులలో అష్ట బంధనం చేసి జాతర మొదలయ్యేందహో అంటూ చాటింపు వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మురళీస్వామి, కైకాల కులస్తులు, అవిలాల గ్రామపెద్దలు పెద్దిరెడ్డి, సురేష్, లోకేష్, చెంగల్రాయులు, వెంకటేష్ పిళ్లై, తనూజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం





బుచ్చినాయుడుకండ్రిగలో నెల రోజులుగా మూతపడి ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం, ఏటీఎం పనిచేయటంలేదని మిషన్‌పై అంటించిన నోటీసు

బుచ్చినాయుడుకండ్రిగ: స్టేట్‌బ్యాంకు ఏటీఎం గత నెల రోజులుగా మూత పడడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలో బుచ్చినాయుడుకండ్రిగలో ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎం మాత్రమే ఉంది. ఈ ఏటీఎం మిషన్ నెల రోజుల క్రితం మరమ్మతులకు గురి కావడంతో సిబ్బంది మూత వేశారు. దీంతో ఖాతాదారులు డబ్బులు కోసం నానా అవస్థలు పడుతున్నారు. బ్యాంకు సెలవు దినాల్లో ఖాతాదారుల బాధలు వర్ణనాతీతం. ఏటీఎంను వాడుకుంటున్నారని ఎస్‌బీఐ బ్యాంకు వారు సంవత్సరానికి రూ.150 చార్జీ వసూలు చేస్తూ, నెల రోజులుగా ఏటీఎం మిషన్ మూత వేయడం దారుణమని ఖాతాదారులు వాపోతున్నారు. డబ్బుల కోసం బ్యాంకులో గంటలు తరబడి బారులు తీరుతున్నారు. ఖాతాదారులు పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే యాప్‌ల ద్వారా కమీషన్ చెల్లించి షాపుల వద్ద నగదు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి పాలాభిషేకానికి పాల బిందెలను తీసుకెళ్తున్న మహిళలు



వివిధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఏట్టుకూరిపల్లె: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏటూకూరిపల్లె గ్రామంలో వెలసిన బాట గంగమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు అంబలి పోశారు. ఉదయం గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లు, అంబలితో నయ్యాడి వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం పాల బిందెలతో మహిళలు గ్రామాల్లో ఊరేగించి అమ్మవారిని పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పసుపు, కుంకుమ భక్తులు తెచ్చిన వివిధ పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారిని దర్శించడానికి వచ్చిన భక్తులకు అంబలి, తీర్థప్రసాదం పంచి పెట్టారు.

మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన

- జూన్ 29న జాతీయ లోక్‌అదాలత్
- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: న్యాయవాదులు మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర సూచించారు. మంగళవారం స్థానిక సబ్‌కోర్టులో న్యాయవాదులకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వ్యాజ్యం కంటే మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కారించుకోవడం ద్వారా సంతృప్తికరమైన ఫలితం పొందవచ్చని వివరించారు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించబడిన కేసుల్లో కోర్టు ఫీజులను వాపసు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు ఆందోళన తగ్గి, మనశ్శాంతి కలుగుతుందన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి జానకి మాట్లాడుతూ జూన్ 29న కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి మురళి, న్యాయవాదులు పాల్గొన్నారు.





జలకాలాటలలో..

ఎండ వేడిమి తీవ్రత ఎక్కువగా ఉండడంతో యువకులు చల్లదనం కోసం బావుల్లో ఈత కొడుతూ సేద దీరుతున్నారు. మధ్యాహ్నం పాఠశాలలకు సెలవు రోజు కావడంతో పంట పొలాల్లోని బావుల్లోని చల్లని నీటిలో యువకులు జలకాలాడుతున్నారు. బావుల్లో పైనుండి కేరింతులు కొడుతూ దూకుతూ ఎండ నుండి ఉపశమనం పొందుతున్నారు.

- బుచ్చినాయుడుకండ్రిగ